


47 సంవత్సరాల క్రిందట విడుదలైన ఈ నవల ఆ రోజుల్లో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. 1962 నుంచీ 1976 వరకూ మూడు సార్లు పునర్ముద్రించబడింది. దాదాపు 15,000 కాపీలు పైగా అమ్ముడుపోయాయి ఆ రోజుల్లోనే. ఈ నవల పుస్తకం వెనుక నున్న క్రింది వాక్యాలు నవల పట్ల ఉత్కంఠతని రెట్టింపు చేస్తాయి.

***

భారతి భుజాల మీద ఏదో చేతులు వేసింది. మొహానికి ఏదో రాసుకుంది? ఏమిటది?

మెట్లమీద ప్రసాద్ చూసిన ఆకారం ఏమిటి? మనిషి కాదని నిశ్చయంగా ఎందుకన్నాడు? వైకుంఠరావు చనిపోయి రెండు రోజులైంది. అతని శవం, మేడమీద కుర్చీలో ఎట్లా ఉంది? ఇంట్లో ఎట్లా తిరుగుతోంది?

"దూరంగా పొండి, తలుపు దగ్గరకి వెళ్ళకండి" అని అరుస్తూ భారతి ప్రసాద్‌నీ, శేఖర్‌నీ ఎందుకు వెనక్కి లాగింది.?

ఈ పుస్తకం రాత్రిళ్ళు ముట్టుకోవద్దు. ఒంటరిగా ఉన్నప్పుడు చదవొద్దు. భయం వేసినప్పుడు అప్పటికి చదవడం ఆపి కొంతసేపటి తర్వాత మళ్ళీ మొదలుపెట్టండి..!

(తెలుగులో మొట్టమొదటి హారర్ ఫిక్షన్ నవల ఇది . మొదటి ముద్రణ: 1962లో)




## (క్రిందటి సంచిక నుంచీ తరువాయి)

శేషయ్య, ప్రసాద్, శేఖర్ త్వర త్వరగా మెట్లు దిగి, తిన్నగా హాల్లోకి వెళ్ళారు. కిందపడిపోయిన లాంతర్‌ని ఎత్తి పెట్టాడు ప్రసాద్. శేషయ్య టార్చి వెలుగులో హాలంతా పరీక్షగా చూశాడు. ఒకళ్ళని ఒకళ్ళు గట్టిగా పట్టుకుని గజ గజ ఒణుకుతూ నేలమీద పడున్న ఆ ఇద్దరు స్త్రీలని చూసి దగ్గరకు వెళ్ళి "లెండమ్మా! లెండి! భయంలేదు, మేమంతా మెలుకువగానే ఉన్నాము, శేఖర్‌గారు, ప్రసాద్ గారూ కూడా ఇక్కడే వున్నారు" అన్నాడు శేషయ్య.

భయం వల్ల మొహాలకి చేతులు అడ్డం పెట్టుకున్న, ఆ ఇద్దరూ వేళ్ళ సందుల్లోంచి చూశారు. శేషయ్యని చూడగానే పోయిన ప్రాణం వచ్చినట్లయింది. లేచి కూర్చున్నారు.

"ఏమమ్మా! ఎందుకు అరిచారు?" అడిగాడు శేషయ్య.

"మొద్దబ్బాయి - మొద్దబ్బాయిని దెయ్యం చంపేసింది" అన్నది భానుమతి.

"మొద్దబ్బాయినా!? ఎక్కడున్నాడు? మీరెప్పుడు చూశారు?" ఆందోళనతో అడిగాడు శేషయ్య.

"ఆ మెట్లపక్కన" అని భానుమతి అంటుండగానే శేషయ్య పరిగెత్తాడు.

మెట్లపక్కన గోడదగ్గర నేలమీద పడున్నాడు మొద్దబ్బాయి. అతని ప్రక్కన ఎర్రని రక్తపు మరకలు కనిపించాయి. శేషయ్య మోకాళ్ళ మీదకి వొంగి మెద్దబ్బాయి గుండె మీద చెయ్యి పెట్టి చూసి సంతోషంతో నిట్టూర్చాడు. మొద్దబ్బాయి గుండె కొట్టుకుంటోంది. ఊపిరి పీలుస్తున్నాడు.

"అమ్మయ్యా! ప్రాణానికి మోసం లేదు" అన్నాడు శేషయ్య పక్కనే నిలుచున్న ప్రసాద్‌తో.

"ఆ రక్తం ఏమిటి? గాయం తగిలిందా?"

"చూడాలి" అంటూ శేషయ్య మొద్దబ్బాయిని పరీక్ష చేసి "గాయం తగలలేదు. స్పృహ పోయింది అంతే. చల్లని నీళ్ళు తీసుకురండి" అన్నాడు.

మొహం మీద నీళ్ళు చల్లిన కాసేపటికి కళ్ళు తెరిచాడు మొద్దబ్బాయి. జరిగినదంతా భారతి శేషయ్యకి చెప్పింది. అప్పటికి తతిమ్మా వాళ్ళందరూ నిద్రలేచారు. ఒకళ్ళ మొహం ఒకళ్ళు చూసుకున్నారు. అంతవరకూ దెయ్యమని నమ్మని వాళ్ళందరూ దెయ్యమేనని రూఢీ చేసుకున్నారు. అందరి కళ్ళూ భయంతో, ఆదుర్దాతో చూస్తున్నాయి.

"నేనొక మాట చెపుతాను. అందరూ జాగ్రత్తగా వినండి." అన్నాడు కామరాజు. ఇంటి పెద్ద ఆ మాట అనగానే అందరూ ఆయనవేపు తిరిగారు,

"ఇంట్లో ఉన్న వాళ్ళంతా ఈ క్షణం నుంచీ కట్టకట్టుకుని ఒకేచోట ఉండాలి. ఎవరూ ఒంటిగా ఎక్కడికీ వెళ్ళకూడదు. దెయ్యమో, దెయ్యం లాంటిదేదో కనిపిస్తే అదేమిటో తెలుసుకునేందుకు వెళ్ళకూడదు. వెళ్ళవలసిన అవసరం లేదు. ఈ ఇంట్లో దెయ్యం ఉందో లేదో తెలుసు కోవడం మనవల్లకాదు. అంత సాహసించవలసిన అవసరం లేదు. వరద తగ్గితే చావు తప్పితే చాలునని అందరం ఈ ఇంట్లోనుంచి వెళ్ళిపోదాం. కుర్రవాళ్ళూ ధైర్యస్తులూ అయిన శేఖర్, ప్రసాద్‌లకి ముఖ్యంగా చెపుతున్నాను. ఎక్కడ ఏ చప్పుడయినా మీ ఇద్దరిలో ఎవరికి ఆపద కలిగినా తర్వాత మా గతేం కాను!? కనుక అవివేకంగా ప్రవర్తించవద్దు, భయంకరమైన స్వరూపాలు కాని, భయంకరమైన సంఘటనలు కాని జరిగితే భగవంతుణ్ణి ప్రార్థిస్తూ కూర్చుందాము" అన్నాడు కామరాజు.

కామరాజులో ధైర్యం పూర్తిగా నశించిందని అందరికీ అర్థమైంది. చావు తప్పితే చాలు - అదొక్కటే అందరి ఆదుర్దా.

"నిద్రపోలేదూ?" మృదువుగా, లాలనగా వినిపించాయి ఆ మాటలు.

ఉలిక్కిపడి పక్కకి చూశాడు శేఖర్.

"నేనే -" అన్నది భారతి చిరునవ్వుతో.

శేఖర్ కూడా నవ్వి "చీమ చిటుక్కుమంటే ఒళ్ళు జలదరిస్తోంది. అలా తయారయింది ఈ ఇల్లు. నీకూ నిద్రపట్టలేదా?" అడిగాడు.

"లేదు, కళ్ళు మూసుకుంటే రక్తమయమైన వైకుంఠరావుగారి శవం కళ్ళముందు కట్టినట్లు కనిపిస్తోంది. కళ్ళు తెరిచి గోడవైపు చూస్తూ కూర్చోవడం నయంగా ఉంది"

"అవును మొగాళ్ళం మాకే ఇలా ఉంటే ఇక మీ విషయం చెప్పాలా!" అంటూ భారతి చెయ్యి తన చేతిలోకి తీసుకుని "ఈ ఇంట్లో ఉంటే చావు తప్పదు అని అందరికీ భయం పట్టుకుంది. ఎంత త్వరగా వెళ్ళిపోదామా అనే అందరి ఆలోచనా. నాకు కూడా అలాగే అనిపిస్తోంది. ఈ వరద తగ్గితే వెళ్ళిపోవచ్చు."

"అవును వెళ్ళిపోవచ్చు. నా దగ్గర్నించి ఉత్తరం రాలేదని మా అమ్మ చాలా ఖంగారు పడుతూ ఉంటుంది."

"భారతీ నేను అడిగిన ప్రశ్నకి సమాధానం చెప్పలేదు నువ్వు"

"ఏమడిగారు?"

"నన్ను పెళ్ళి చేసుకుంటావా అని అడిగాను కదూ?"

"చెప్పానుగా."

"చెప్పలేదు, మా నాన్న ఒప్పుకోరన్నావు."

"అవును, మీ నాన్న ఒప్పుకుంటే నేను ఒప్పుకుంటాననేగా దాని అర్థం."

శేఖర్ భారతి భుజం మీద చెయ్యివేసి ఆమెని దగ్గరకి తీసుకున్నాడు. ఆ హాల్లో పడుకున్న వాళ్ళల్లో ఇంకెవరయినా మెలుకువగా ఉండి చూస్తున్నారేమోనని విషయం జ్ఞాపకం రాలేదు.

"భారతీ! నేను విదేశాలకి వెళ్ళి తిరిగి వచ్చేటప్పటికి నువ్వు కనిపిస్తావని తెలిసివుంటే ఇంకా ఎంతో త్వరగా వచ్చేవాణ్ణి. నా మాట నమ్ముతావా!"

"ఏమిటి?" అడిగింది భారతి అమాయకంగా.

"నిన్ను చూసిన తర్వాత నాలో కొత్త జీవం పోసినట్లయింది. ఇన్నాళ్ళూ బతకడం నిన్ను చూడడానికేననీ, నీ కోసమే నేను పుట్టాననీ, నీ కళ్ళల్లోకి చూడడం కోసమే నాకు కళ్ళున్నాయనీ, నిన్ను స్పృశించడానికే నాకు చేతులున్నాయనీ, నీతో మాట్లాడడానికే నాకు నోరున్నదనీ, అనిపిస్తోంది."

భారతి నవ్వుతూ "చాలు! చాలు! మీరిలా ఆవేశంతో ఉపన్యాసం ప్రారంభిస్తే అందరూ లేస్తారు" అని అతని నోటికి చెయ్యి అడ్డుపెట్టింది. ఆమె అరిచేతిని శేఖర్ పెదిమలతో స్పృశించాడు.

"ఏమిటీ అల్లరి?" అంటూ భారతి చెయ్యి తీసేసుకుంది.

సరిగా ఆ సమయానికి ఎక్కణ్ణించో ధన్ ధన్ మన్న శబ్దం వినిపించింది.

"ఎక్కడా చప్పుడు?" అడిగింది భారతి.

"మేడమీదలా ఉంది" అన్నాడు శేఖర్,

మళ్ళీ ధన్ ధన్ మని చప్పుడయింది. భారతి శేఖర్‌కి ఇంకొంచెం దగ్గరగా జరిగి "నాకు భయం వేస్తోంది." అన్నది అతని చెవిలో.

"నేనున్నానుగా! నా దగ్గిరేవున్నావుగా. ఎందుకు భయం?" అంటూ ఆమె నడుం చుట్టూ చెయ్యివేసి దగ్గరికి లాక్కున్నాడు.

ధన్ ధన్ మని త్వర త్వరగా చప్పుళ్ళు వినపడుతున్నాయి. దేన్నో కొడుతున్నట్లు, ఇల్లు అదురుతున్నట్లు ఉన్నది. "ప్రసాద్!" పద్మ కేకేసింది.

"ఏమిటి పద్మా?"

"ఆ చప్పుడు, భయం వేస్తోంది."

"గాలికి కిటికీలు కొట్టుకుంటున్నాయేమో! భయం ఎందుకు?"

పద్మ లేచి ప్రసాద్ దగ్గరికి వెళ్ళి "నేనిక్కడ కూర్చుంటాను. నాకు భయం వేస్తోంది" అన్నది.

"రా! ఇలా పక్క మీద కూర్చో! పిచ్చి పిల్లా.. మేమంతా ఇక్కడే ఉన్నాంగా! భయం ఎందుకు?" అని అతను పద్మ చేతిని తన చేతిలోకి తీసుకుని "నేనున్నానుగా.. నిద్రపో!" అన్నాడు.

ధన్ ధన్ మంటూ చప్పుడు వినిపిస్తూనే ఉంది.

"తలమీద ఎవరో కొడుతున్నట్లు చప్పుడవుతుంటే నిద్ర ఎలా వస్తుంది?" అడిగింది పద్మ.

"ఏ కిటికీ తలుపో అయివుంటుంది. వెళ్ళి మూసేసి వస్తే సరి."

"అమ్మయ్యో! ఒద్దు నువ్వు ఇక్కణ్ణించి కదలడానికి వీల్లేదు. మామయ్య ఇందాక ఏం చెప్పాడు!? ఎవర్నీ సాహసం చెయ్యవద్దని చెప్పలేదూ!" అన్నది పద్మ అతని చెయ్యి గట్టిగా పట్టుకుని.

"నిజమే కాని ఇలా చప్పుడవుతుంటే నిద్ర ఎలా పడుతుంది?" అన్నాడు ప్రసాద్.

అంతలో కామరాజు లేచి లాంతర్ ఒత్తి పెద్దది చేసి "ఏమ్రా మీరెవరూ నిద్రపోలేదూ?" అడిగాడు.

"అలా చప్పుడవుతుంటే ఎలా నిద్ర పడుతుంది మామయ్యా?" అన్నది పద్మ.

"అవును. అందుకే నాకూ నిద్రరాలేదు."

"ఏమిటో ఆ చప్పుడు?" అన్నాడు శేఖర్.

"నువ్వూ మెలుకువగానే ఉన్నావా?" అంటూ కామరాజు కొడుకువైపు తిరిగాడు. భారతి శేఖర్‌కి దూరంగా జరిగింది.

"భారతి కూడా నిద్రపోలేదు. ఆ చప్పుడు వింటూ కూర్చున్నాం" అన్నాడు శేఖర్.

"బహుశా ఏ తలుపో గాలికి కొట్టుకుంటూ ఉంటుంది." అన్నాడు లింగమూర్తి.

"అయిుండవచ్చు కాని ఎవరూ ఈ గదిలోంచి వెళ్ళకండి" అన్నది భానుమతి.

ప్రసాద్ నవ్వాడు.

"ఎందుకురా నవ్వు?"

"సామాన్యంగా ఇంట్లో ఎక్కడ ఏ చప్పుడయినా, "ఏమండీ ఏదో చప్పుడవుతోంది వెళ్ళి చూడండి" అని నాన్నని వేపుకు తినేదానివి ఎవర్నీ కదలవద్దంటే నవ్వు వచ్చింది."

"సామాన్యంగా ఇంట్లో అయే చప్పుళ్ళు వేరు, ఈ చప్పుళ్ళు వేరు. మన ఇంట్లో ఎన్నడయినా శవం నడిచి వచ్చిందిట్రా?"

"నోరు ముయ్యి! ఆడపిల్లలు, అసలే భయంతో వణికిపోతుంటే నువ్వు ఈ ఆ విషయాలన్నీ జ్ఞాపకం చేస్తావేమిటి?" అన్నాడు లింగమూర్తి.

మేడమీద చప్పుడు అవుతూనే ఉంది.

"నాన్నా! ఆ చప్పుడు వింటూ రాత్రంతా ఇలా మెలుకువగా ఉండవలసిందేనా?" అడిగాడు శేఖర్.

"మరి చేసేదేముంది?"

"వెళ్ళి చూసి -"

"ఒద్దు, వెళ్ళొద్దని ఇందాకే చెప్పాను. కాసేపట్లో నిద్రపడుతుందిలే నిద్రపట్టనివాళ్ళు నా నిద్రమాత్రలు వేసుకోండి."

"అదికాదు నాన్నా! నేను ఒంటిగా వెళ్ళను."

"ప్రసాద్‌ని తీసుకు వెళతానంటావు! ఒద్దు నాయనా! నువ్వూ వెళ్ళవద్దు వాణ్ణీ తీసికెళ్ళవద్దు" అన్నది భానుమతి.

"ప్రసాద్‌ని కాదు శేషయ్యనీ, మునయ్యనీ, రాజారాంనీ, తీసుకువెళతాను."

" మీరంతా వెళ్ళిపోయి మమ్మల్ని.." అన్నది పద్మ.

"నాన్న, బాబాయి, వంటమనిషి ఉంటారుగా ఇక్కడ."

"వద్దండి! రాత్రి చీకట్లో వెళ్ళొద్దు.. మేడమీద.." అని పూర్తిగా చెప్పకుండా ఊరుకుంది భారతి.

మేడమీద నడవాలో ఉన్న శవం అందరికీ జ్ఞాపకం వచ్చి ఒళ్ళు జలదరించింది.

"ఆ విషయం ఇక చర్చించకండి," అన్నాడు కామరాజు. అయిదు నిమిషాలపాటు అందరూ మౌనంగా ఉండిపోయారు. మేడమీద ఎక్కడో అవుతున్న ఆ చప్పుడు తప్ప వాళ్ళకి ఇంకేమీ వినిపించడం లేదు. ఆ చప్పుడు ఎందుకు వస్తోంది అనే విషయం గురించి ఎవరికి వాళ్ళు ఊహించుకుంటున్నారు.

"నాన్నగారూ! మేము నలుగురం కలిసి వెళితే భయం ఏముటుంది?" అన్నాడు శేఖర్.

"అబ్బ! ఏం మొండితనం శేఖర్! సరే, అంత సాహసం చెయ్యాలని ఉంటే ముందు శేషయ్యనీ, రాజారాంనీ, మునయ్యనీ కేకేసి పిలు. తర్వాత చూద్దాం." అన్నాడు కామరాజు.

శేఖర్ దిండు కిందనుంచి టార్చి తీసి వెలిగించి లేచి నిలుచున్నాడు. "నేనూ వస్తానుండు" అని ప్రసాద్ లేచాడు.

"నా దృష్టిలోంచి అవతలకి వెళ్ళవద్దు. తలుపు దగ్గిర నిలబడి కేక వెయ్యి" అన్నాడు కామరాజు.

"అందరికన్నా ముందు మీరు వెళ్ళకండి" అన్నది భారతి శేఖరుతో.

"నౌకర్లు వచ్చిన తర్వాత శేఖర్‌కి తోడు వెళతారులే" అన్నది పద్మ.

శేఖర్, ప్రసాద్ తలుపువైపు నడిచారు. శేఖరు చేతిలో ఉన్న టార్చి వెలుగు పైకీ కిందకీ పడుతోంది తలుపుకి ఇంకా నాలుగు అడుగుల దూరంలో ఉండగా, భారతి లేచి ఒక్క గంతు వేసి శేఖర్‌నీ ప్రసాద్‌నీ మెడలు పట్టుకుని వెనక్కి లాగింది. ఆకస్మికంగా వెనకనించి ఎవరో వచ్చి మెడ పట్టుకోగానే ఆ ఇద్దరికి మతిపోయినట్లయి పిడికిలి బిగించి వెనక్కి తిరిగి చూసుకోకుండా భారతిని కొట్టారు.

"శేఖర్ మతిపోయిందా! భారతి" అని అరిచాడు కామరాజు.

కామరాజు అలా అరవగానే వెనక్కి తిరిగి చూసి "భారతీ! నువ్వా..? నిన్నా కొట్టాను?" అన్నాడు శేఖర్ గద్గద కంఠంతో. ప్రసాద్ ఖిన్నుడై తన చేతులు చూసుకుంటూ "క్షమించు భారతీ ఏదో వచ్చి మా మీద పడిందనుకున్నాను"

వాళ్ళు కొట్టిన దెబ్బలకి నేలమీద పడిపోయిన భారతి పక్కన కూర్చుని మోకాళ్ళ మీద వొంగి "భారతీ! నొప్పి పుడుతోందా? తలమీద కొట్టానా? చెప్పు భారతీ!" అని బతిమాలాడు శేఖర్.

"ఎందుకు భారతీ మమ్మల్ని అలా మెడలు పట్టుకుని లాగావు?" అడిగాడు ప్రసాద్.

"నాకు నాలుగు దెబ్బలు తగిలితే జరిగిన పెద్ద హాని ఏం లేదు" అంటూ భారతి లేచి నిలబడి రెండడుగులు వెనక్కి వేసి "అదుగో! అక్కడ చూడండి!" అన్నది గుమ్మం వైపు వేలు పెట్టి తలుపుపైన చూపిస్తూ. అందరూ అటు చూశారు. "ఏముంది? ఏం లేదే" అడిగాడు ప్రసాద్.

"బయటకి వెళ్ళవద్దంటావా?" అడిగాడు శేఖర్.

"సరిగా చెప్పు అమ్మాయీ? ఏమిటి గుమ్మం పైన ఏమున్నది?" అడిగాడు కామరాజు. పద్మ, భానుమతి భారతిని సమీపించి చెరో చెయ్యి పట్టుకుని "పాపం భయంతో వణికిపోతోంది" అన్నారు.

"అక్కడ పామున్నది" అంది భారతి హీన స్వరంతో. అందరూ మళ్ళీ అటు చూశారు. శేఖర్ టార్చి వెలుగు గుమ్మంపైన ద్వార బంధం మీద వేసి "ఏం లేదే!"

"రా పడుకోవమ్మా! కళ్ళు మూసుకుని ఆంజనేయ జపం చెయ్యి" అన్నది భానుమతి దయగా.

"నేను భ్రమపడలేదు. నాకళ్ళతో చూశాను. ఆ ద్వారం పైన పెద్ద పామున్నది. ఇందాక తల కనిపించింది. పైకి వెళ్ళిపోయివుంటుంది" అన్నది భారతి గజ గజ వణుకుతూ

"పామా! పామయితే పర్వాలేదు కొడితే చస్తుంది"

"ప్రసాద్‌గారూ! ఆ పాము ఎలా ఉందో మీరు చూడలేదు" అన్నది భారతి.

శేఖర్ మొహం చిట్లించాడు. భారతి మాట నిర్లక్ష్యం చేసి వెళ్ళటం ఇష్టం లేదు. గదిలో ఉండనూ లేడు. ఏం చెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు. టార్చి వెలుగు ద్వారం పైన వేసి ఉంచాడు. నల్లగా తళతళ మెరుస్తున్నాయి కళ్ళు. తలముందు కనిపించింది... తర్వాత ఒంపులు తిరుగుతూ నెమ్మదిగా కిందకి జారింది. రెండడుగుల పొడుగున ద్వార బంధం మధ్య వేళ్ళాడుతోంది. గిర గిర తిరుగుతోంది. ఒళ్ళు విరుచుకుంటోంది. దీపం వేపు చూస్తోంది. అందరూ ఊపిరి బిగపట్టి కదలకుండా నిలుచున్నారు. పాము నెమ్మదిగా ఇంకో రెండడుగులు కిందకి జారిందిగాని తోక కనిపించలేదు. "చాలా పెద్దది. ఆరు అడుగులపైన ఉండి ఉండాలి" అన్నాడు లింగమూర్తి రహస్యంగా.

తలుపుకి నాలుగయిదు అడుగుల దూరంలో నిలుచున్న శేఖర్ని, ప్రసాద్‌నీ, భారతినీ వెనక్కి లాగి "దూరంగా రండి ఎంత పెద్ద పామో!" అన్నాడు కామరాజు రొప్పుతూ. ఒకళ్ళని ఒకళ్ళు ఆనుకుని గుంపులుగా నిలుచున్నారు అందరూ. ఆడవాళ్ళు భయంతో క్షణ క్షణానికి నేల మీద చూస్తున్నారు. ఇంకో పాము ఏమూలనుంచో వస్తుందేమోనన్న భయంతో శేఖర్, ప్రసాద్ తలుపు మీద ఉన్న పాముని రెప్ప వాల్చకుండ చూస్తున్నారు.

"నీ పిస్తోలేమైంది?" అడిగాడు ప్రసాద్.

"నా గదిలో ఉంది తీసుకురావడం మరచిపోయాను."

"డామిట్! అవసరం అయినపుడు లేకుండా పోతుంది" అన్నాడు ప్రసాద్ విసుగ్గా.

"అదితాచు. నల్లని తాచు" అన్నది భానుమతి.

"వాళ్ళిద్దరి ప్రాణాలు రక్షించినందుకు భారతికి చాలా ఋణపడివున్నాం" అన్నాడూ లింగమూర్తి.

శేఖరు పామునే తదేక దృష్టితో చూస్తున్నాడు. ఆ తాచు కిందవరకూ పాకుతూ వచ్చి మళ్ళీ నెమ్మదిగా పైకి పాకి వెళ్ళిపోయింది. తల కనిపించడం లేదు.

"ఈ ఇంట్లో పాములున్నాయా నాన్నా?" అడిగాడు శేఖర్. "ఇంతకుముందు ఎన్నడూ పాము ఇంట్లోకి రాలేదు. ఒకటి రెండుసార్లు చిన్న చిన్న పాములని తోటలో చంపారు" అన్నాడు కామరాజు.

"ఈ పాముని చంపితే కాని బయటకి వెళ్ళడానికి వీల్లేదు."

"తలుపుకి అవతల ద్వారం పైన ఉన్న పాముని ఎలా చంపడం?" అన్నాడు లింగమూర్తి.

మళ్ళీ ఆ పాము నెమ్మదిగా తలకిందకి జారవిడిచింది. మెలికలు తిరుగుతూ బుసలు కొడుతూ, ద్వార బంధానికి ఆనుకుని నెమ్మదిగా కిందకి జారింది. నేలకి అడుగు ఎత్తు వరకు వచ్చి మళ్ళీ పైకి వెళ్ళిపోవడం ప్రారంభించింది.

"ప్రసాద్! ఆ కుర్చీ విరగగొట్టి కోడు ఇలా ఇయ్యి" అన్నాడు శేఖర్.

"దేనికి?" అడిగాడు కామరాజు.

"పాముని చంపడానికి" దృష్టి తలువైపు నుంచి మరల్చకుండానే చెప్పాడు శేఖర్,

పాము మళ్ళీ పైకి వెళ్ళిపోయింది. కనిపించడం లేదు. ప్రసాద్ కుర్చీ నేలకేసి కొట్టి, విరిచి రెండు కోళ్ళు ఊడతీసి ఒక కోడు శేఖర్ కిచ్చి రెండో కోడు తను తీసుకున్నాడు. పాము మళ్ళీ నెమ్మదిగా కిందకి జారుతోంది.

"బాబాయ్! టార్చి తీసుకుని వెలుగు తలుపు మీద వెయ్యి." అన్నాడు శేఖర్.

"ఒకమాట" అన్నది భారతి.

"ఏమిటి?" అడిగాడు శేఖర్.

"అది పామేనా! నిజంగా పామా కాదా అని ఆలోచించారా?"

"కళ్ళకి పాము స్పష్టంగా కనిపిస్తుండగా పాము కాదేమో అన్న సందేహం ఎందుకు కలిగింది?" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

"ఒక విషయం ఆలోచించారా?" అడిగింది భారతి శేఖర్ చెయ్యి పట్టుకుని.

"ఏమిటది?"

"అది ఆ తలుపు దగ్గరే గుమ్మానికి అతుక్కున్నట్లు ఎందుకు అక్కడే తిరుగుతోంది!"

"ఏమో!" అన్నాడు ప్రసాద్. పాము మెలికలు తిరుగుతూ గుమ్మం మీద నుంచీ కిందకి జారుతోంది. తల ఇటూ అటూ తిప్పుతోంది. క్షణం క్షణం నాలిక బయట పెడుతోంది. నిగ నిగ మెరుస్తున్న పాము మీద నుంచి టార్చి వెలుగు వివిధ కోణాల్లోంచి ప్రతిబింబిస్తోంది. నల్లని ఆ తోలు మీద, నల్లని గీతలు, నల్లని గీతల్లో ఇంకా నల్లగా ఉన్న చుక్కలు. ఆ నల్లని చుక్కల్లో మరీ నల్లగా ఉన్న గీతలు.

"నిజమైన పామే అయితే మనుష్యులు దగ్గర్లో మాట్లాడుతుంటే అలా అక్కడే ఉంటుందా? పారిపోదూ!" అన్నది భారతి. అందరూ పాముని పరీక్షగా చూస్తున్నారు.

శేఖర్ నవ్వాడు. "నిజం పాము కాదనీ, రబ్బరు పాము అనీ అంటున్నావా? కాదు నిజం పామే! నాలిక బయటికి పెడుతోంది. కళ్ళు చూడు ఎట్లా మెరుస్తున్నాయో!"

"అబ్బా! నేను చూడలేను. రబ్బర్ పాము కాదు నిజం పామే. కాని సామాన్యమైన తాచుపాము కాదేమోనని నా అనుమానం. పాము మనుష్యుల అలికిడి వింటే పారిపోతుంది. అక్కడే ఎందుకుంటుంది? మనల్ని ఎలా చూస్తున్నదో, నవ్వుతున్నట్లు, ధైర్యం ఉంటే గుమ్మందాటి రండి మీ పనిపడతాను, ఏమౌతారో చూస్తాను అంటున్నట్లు చూస్తోంది. నిజ పామైతే ఆ తలుపు దగ్గరే కిందకీ పైకీ ఎందుకు నాట్యం చేస్తుంది?" అన్నది భారతి భయంతో.

శేఖర్ నవ్వి "బావుంది అయితే ఈ పాము దెయ్యం అంటావా భారతీ. దగ్గరికి వెళ్ళగానే పాము పులిగా మారుతుందా?" అన్నాడు.

"పులిగా మారుతుందో, సింహంగా మారుతుందో మీరు కొట్టే దెబ్బలకి చావకుండా మిమ్మల్ని కాటు వేస్తుందో నేనేం చెప్పగలను?" అన్నది భారతి.

"భారతి చెప్పిన విషయంలో నిజం లేకపోలేదు శేఖర్. మామూలు పామైతే ఇంతసేపు ఆ తలుపు మీద ఎందుకుంటుంది? నువ్వు ఆ కర్ర యిలాతే" అన్నాడు కామరాజు శేఖర్ చేతిలో కర్ర లాక్కుంటూ.

"అయితే ఆ పాముని చూస్తూ ఊరుకోవాలా!" అడిగాడు శేఖర్. "అవును చూస్తూ కూర్చుందాం. అది ద్వారబంధం మీద నుంచి కిందకి దిగి లోపలికి వస్తే కొడదాం. లేదా తెల్లారేంతవరకూ దాన్ని చూస్తూ కూర్చోవాలి."

"తెల్లారిన తర్వాత?"

"నౌకర్లు ఎవరయినా ఇటు వస్తారు. వెలుగుంటుంది అది ఎటు పోతుందో చూడవచ్చు" అన్నాడు కామరాజు. టార్చి వెలుగు గుమ్మం మీదే వేసి ఉంచారు. అందరి కళ్ళు ఆ పాముమీదే ఉన్నాయి. రెప్పవాల్చకుండా చూస్తూ కూర్చున్నాడు.

"పోనీ నౌఖర్లని ఇప్పుడే పిలిస్తే?" అడిగాడు ప్రసాద్.

"పాపం వాళ్ళకి మాత్రం ప్రాణాపాయం కాదూ!" అన్నాడు కామరాజు.

30

"మేడ మీద ఏదో చప్పుడవుతోంది. చెవుల్లో గునపం పెట్టి కొడుతున్నట్లున్నది. నిద్రపట్టడం లేదు" అన్నది సావిత్రి.

"ఏమిటో ఆ చప్పుడు?" అన్నది దాసీది.

మునయ్య, శేషయ్య, మొద్దబ్బాయి ఒకవైపున, రాజారాం, సావిత్రి, దాసీది, వంటమనిషి ఇంకో పక్కనా పడుకున్నారు. లాంతర్ సన్నగా వెలుగుతోంది.

"వెళ్ళి చూసివస్తే సరి" అన్నాడు మునయ్య.

"అర్ధరాత్రి ఈ దెయ్యం కొంపలో ఎవరు వెళతారు మేడమీదికి" అన్నది దాసీది.

"నాకేం భయం లేదు. నేను ఒంటిగా వెళ్ళగలను" అని మునయ్య లేచాడు.

శేషయ్య, మొద్దబ్బాయి పడుకునే ఉన్నాడు.

"లాంతరు తీసుకువెళ్ళనా?" అడిగాడు మునయ్య.

"అమ్మ బాబోయ్! ఈ గదంతా చీకటైపోదూ?" అన్నది సావిత్రి ఖంగారుగా.

మునయ్య నవ్వి "అయితే చీకట్లో ఎలా వెళ్ళడం?" అంటూ తలుపు వైపు రెండడుగులు వేసి, చటుక్కున ఆగిపోయి వెనక్కి నాలుగు అడుగులు వేశాడు.

"ఉత్తరకుమారుడి మల్లే -" అని నవ్వింది దాసీది.

"ఉష్!" అన్నాడు మునయ్య.

"ఏమిటి?"

"పాము నల్ల తాచు. తలుపు పైన చూడండి" మునయ్య రొప్పుతూ అన్నాడు. శేషయ్య, మొద్దబ్బాయి లేచి నిలుచున్నారు. తతిమ్మా వాళ్ళంతా తలుపుకి దూరంగా వెళ్ళి గోడకి నక్కి నిలుచున్నారు. గుమ్మం పై నుంచి కిందకి పాకి, మళ్ళీ పైకి పాకిపోయింది పాము. మౌనంగా అందరూ ఆ పామునే చూస్తూ నిలుచున్నారు. అది మళ్ళీ కిందకి పాకి వచ్చి గుమ్మం మీద తారట్లాడుతోంది.

"కర్ర ఇలాతే మొద్దబ్బాయ్!" అన్నాడు శేషయ్య.

"ఏం చేస్తావయ్యా? పాముని కొడతావా? నీకేమైనా మతి పోయిందా? బుద్ధిలేని పని చెయ్యక" అన్నాడు మునయ్య శేషయ్య చెయ్యి పట్టుకుని.

"ఎవరో ఒకళ్ళు ధైర్యం చెయ్యాలి, లేకపోతే ఎలా?"

"ఎందుకు తెగించడం? కాసేపు అక్కడే తారట్లాడి వెళ్ళిపోతుందిలే."

"వెళ్ళకపోతే, లోపలికి వస్తే?" అడిగాడు మొద్దబ్బాయి.

"అప్పుడు కొట్టవచ్చు" సలహా ఇచ్చాడు మునయ్య.

"లోపలికి రానివ్వడం ఎందుకు? ఈసారి కిందకి దిగినప్పుడు తలమీద కొడితే సరి" అని మొద్దబ్బాయి ఇచ్చిన కర్ర గట్టిగా పట్టుకున్నాడు శేషయ్య. మునయ్య బాగా వెనక్కి వెళ్ళి నిలబడ్డాడు. మొద్దబ్బాయి లాంతర్ ఎత్తిపట్టుకున్నాడు. పాము నెమ్మదిగా కిందకి దిగుతోంది. శేషయ్య కర్ర ఎత్తిపట్టుకున్నాడు. అందరూ ఊపిరి బిగపట్టి కళ్ళు పెద్దవి చేసి, రెప్పలార్పకుండా చూస్తున్నారు. పాము బుసలు కొడుతోంది. మెలికలు తిరుగుతోంది. ద్వార బంధం ఆనుకుని కిందకి దిగుతోంది. శేషయ్య కర్ర పైకి ఎత్తాడు. మొద్దబ్బాయి ఒక చేత్తో

లాంతరు, రెండో చేత్తో కర్రా పట్టుకున్నాడు. శేషయ్య ఒక్క అడుగు ముందుకు వేసి ఓ దెబ్బ కొట్టాడు. పాము తలకింద మెడమీద తగిలి చితికి పోయింది. నిమషంపాటు తల ఇటూ అటూ ఆడించి, మెలికలు చుట్టుకుని తలవాల్చేసింది. కింద పడలేదు.

"చావలేదా?" అడిగాడు మొద్దబ్బాయి.

"వచ్చే ఉండాలి" అంటూ శేషయ్య కర్రతో ణము తల ఇటూ అటూ కదిల్చాడు. జీవం లేదు.

"చచ్చినా కిందపడలేదేం?" అడిగాడు మొద్దబ్బాయి.

"ఏమో చూడాలి" అంటూ శేషయ్య లాంతరు తీసుకుని పాము పక్కనుంచి గుమ్మం దాటి అవతలికి వెళ్ళాడు.

గదిలో అందరూ ఆశ్చర్యంతో చూస్తున్నారు. తలుపుకి అవతల నిలబడి లాంతర్ పైకెత్తి పెట్టి పరీక్ష చేసి, శేషయ్య మొద్దబ్బాయిని రమ్మని సంజ్ఞ చేశాడు. మొద్దబ్బాయితో మునయ్య కూడా వెళ్ళాడు.

"చూడు ఎందుకు కింద పడలేదో తెలిసిందా!"

మొద్దబ్బాయి గుమ్మం పైన చూశాడు. గుమ్మము పైన ఉన్న మేకుకి పాము తోక గట్టిగా తాడుతో కట్టేసి ఉంది. తోక తెగిపోయేంత గట్టి ముడి వేసి ఉంది.

శేషయ్య చచ్చిపడివున్న పాము తల చేతితో పట్టుకుని నీరు తెరిచి "దీపం చూపించమన్నాడు" మొద్దబ్బాయి, శేషయ్య పాము నోరు పరీక్ష చేశారు. కోరలు లేవు.

శేషయ్య నవ్వి "పద మేడమీదకి వెళ్ళి ఆ చప్పుడేమిటో చూద్దాం" అన్నాడు.

"నేనూ వస్తాను" అన్నాడు మునయ్య వాళ్ళ పక్కనే నిలబడి.

శేషయ్య తలూపాడు. ముగ్గురూ మెట్లవైపు వెళ్ళారు.

"శేషయ్య!?" కామరాజు పిలుపు వినబడగానే శేషయ్య వెనక్కి తిరిగాడు. ఆ గదిలో అందరూ ద్వారానికి దూరంగా గుంపుగా నిలుచుని ఉండడం అప్పుడు చూశాడు శేషయ్య.

"ఏమండీ!" అంటూ రెండడుగులు ముందుకు వేశాడు.

"ఆగు! ఆగు! గుమ్మం మీద పామున్నది" అన్నాడు శేఖర్.

శేషయ్య మొద్దబ్బాయిని చూసి చిన్నగా నవ్వి "ఈ పాముకయినా కోరలుంటాయేమో చూడాలి" అన్నాడు.

"ఏమో! చంపిన తర్వాతగాని తెలియదు."

"కర్ర పట్టుకురా!"

నిమిషంలో మొద్దబ్బాయి రెండు కర్రలు తెచ్చాడు. "దీపం నా చేతికి ఇవ్వు. నేను పట్టుకుంటాను!" అన్నాడు మునయ్య.

"నా చేతిలోనే ఉంటే బాగా కనిపిస్తుంది" అన్నాడు మొద్దబ్బాయి దీపం ఇవ్వకుండా.

పాముని చంపేసి నోరు తెరిచి పరీక్ష చేసి "దీనికీ కోరలు లేవు" అన్నాడు శేషయ్య.

ఆ మాట విని శేఖర్ "దీనికీ కోరలు లేవు అంటున్నావు. ఇంకో పాముని చంపారా?" అడిగాడు.

శేషయ్య చెప్పాడు.

"విచిత్రంగా ఉంది! కోరలు లేని రెండు పాముల్ని తెచ్చి గుమ్మానికి ఎవరు కట్టివుంటారు? మనిషి అయినవాడు చేసే పని కాదు" అన్నాడు కామరాజు.

మేడమీద ధన్ ధన్ మని చప్పుడు ఇంకా వినబడుతోనే ఉంది.

" ఆ చప్పుడు ఏమిటో చూసివస్తాను" అన్నాడు శేషయ్య.

"నేను కూడా వస్తాను. ముందు నా గదిలోకి వెళ్ళి పిస్తోలు తీసుకోవాలి" అన్నాడు శేషయ్య. శేషయ్య, మొద్దబ్బాయి, శేఖర్, మునయ్య మెట్లు ఎక్కుతున్నారు.

"అదుగో దాన్ని చూడండి!" అని కేకేశాడు మునయ్య ఆఖరు మెట్టు ఎక్కుతూ ఆ నిశ్శబ్దంలో అతని అరుపు లౌడ్ స్పీకర్లోంచి వినిపించినట్లున్నది.

"ఏమిటది? " అడిగాడు శేఖర్.

"ఆ నడవాలో పరిగెత్తింది ఓ పెద్ద ఆకారం. ఎలుగు బంటిమల్లే ఉన్నది."

"ఎలుగు బంటి వస్తే శేఖర్ పిస్తోలుతో కాల్చేస్తాడులే!" అన్నాడు శేషయ్య.

"చప్పుడు ఆగిపోయింది" అన్నాడు శేఖర్.

"అవును అసలు ఎక్కణ్ణించి వచ్చిందో చూద్దాం" అన్నాడు శేషయ్య.

అందరూ నడవాలోకి వెళ్ళారు, కుర్చీ అలాగే ఉంది. నేల మీద గడ్డకట్టిన రక్తం మడుగున్నది. కుర్చీలో శవం లేదు. "మళ్ళీ ..." అన్నాడు శేఖర్ రహస్యంగా.

"ఎక్కడో ఉంటుందిలెండి, రండి!" అని అవతల గదిలోకి దారితీశాడు. అది భారతి గది,

నలుగురూ తలుపు దగ్గరే ఆగిపోయారు. రెండడుగుల పొడగున గోడకి పెద్ద రంధ్రం కనిపించింది. పక్కనే ఓ గెడ్డపార ఉంది. నేలమీద సున్నమూ, ఇటికల ముక్కలూ కుప్పలుగా పడివున్నాయి. పక్కన ఓ అస్థిపంజరం ఉంది. ఆ అస్థిపంజరం చేతుల ఎముకలు కిందకి జారివున్నాయి.

"గుడ్ గాడ్! ఏమిటిది?" అన్నాడూ శేఖర్.

శేషయ్య గదిలోకి అడుగు వెయ్యబోతుండగా శేఖర్ అతని చెయ్యి పట్టుకుని "శేషయ్యా! వద్దు మన వివేకానికి అతీతంగా ఉన్నాయి ఈ ఇంట్లో జరుగుతున్న సంఘటనలు, కిందకి వెళ్ళిపోదాం" అన్నాడు.

శేఖర్ చెయ్యి విదిలించుకుని శేషయ్య లోపలికి వెళ్ళాడు. అస్థిపంజరం పక్కన నిలబడి నేలనీ, అస్థిపంజరాన్నీ పరీక్షగా చూశాడు.

## తరువాయి భాగం వచ్చే సంచికలో

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంథాలయాన్ని సందర్శించండి..

Click here to go to KOUMUDI Library

